




జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు








మంగళవారం 24 మార్చి 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 295 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్





## విద్యుత్ సంస్థలో రిజర్వేషన్లపై బీసీ కమిషన్ విచారణ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 24, ప్రతినిధి: తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి బాలలక్ష్మి కలిసి దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాలయాన్ని సందర్శించి సంస్థలో రిజర్వేషన్ల అమలులో బీసీలకు జరిగిన అన్యాయాలపై సమగ్ర విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఎండీ జితేష్ వి పాటిల్, డైరెక్టర్ సి హెచ్ చక్రపాణి, అధికారులు భాస్కర్, ముజిబుల్లా ఖాన్, అలాగే తెలంగాణ ఎలక్ట్రిసిటీ బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి పాల్గొన్నారు. 2014 నుంచి 2026 వరకు జరిగిన నియామకాల వివరాలను కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించారు. పెండింగ్ కోర్టు కేసులపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ఉద్యోగుల ప్రమోషన్లు, సీనియార్టీ అంశాలను పరిశీలించాలని సూచించారు. బీసీ సెల్‌కు అవసరమైన వసతులు కల్పించాలని కూడా ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో కమిషన్ సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, ప్రత్యేక అధికారి ఎన్. సునీత, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీలో 28న జాబ్ మేళా 100 అప్రెంటిస్ పోస్టులు





సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 24, ప్రతినిధి: ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. భగవతి ప్రొడక్ట్స్ లిమిటెడ్ సంస్థలో 100 అప్రెంటిస్ ట్రైనీ పోస్టులను ఈ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. B.Tech (EEE, ECE), డిప్లొమా (EEE, ECE) పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతకు ఈ అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఎంపికైన వారికి రూ.15,750 వరకు వేతనం లభిస్తుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల ప్రతులతో మార్చి 28న ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

### ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం ప్రారంభం

సందేశం టైమ్స్, హైదరాబాద్, ప్రతినిధి: అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ప్రారంభమైంది. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరగనుంది.

### రైతు భరోసా నిధుల జమపై సీఎంకు కృతజ్ఞతలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, ప్రతినిధి: తొలి విడత రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు రాష్ట్ర శాసనసభ, శాసనమండలి విప్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ధన్యవాదాలు తెలిపారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వారు అభినందించారు.

## 6 గ్యారంటీలకు చట్టబద్ధత బిల్లు – స్పీకర్‌ను కలిసిన కేటీఆర్



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 24, ప్రతినిధి: భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో పార్టీ ఎమ్మెల్యేలు కలిసి 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేట్ మెంబర్ బిల్లు నోటీసును స్పీకర్ గడ్డం ప్రసాద్ కు అందజేశారు. ఈ బిల్లుతో 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే అవకాశం ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ కీలక బిల్లును ప్రవేశపెట్టేందుకు అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను విజ్ఞప్తి చేశారు. ఇదే సందర్భంగా అసెంబ్లీ సెక్రటరీకి కూడా బిల్లు తాలూకు నోటీసులను కేటీఆర్ మరియు ఎమ్మెల్యేలు సమర్పించారు.

## రాజకీయ పార్టీలకు ఉచిత ప్రసార సమయం ఈసీఐ డిజిటల్ వోచర్లు జారీ

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మార్చి 24, ప్రతినిధి: భారత ఎన్నికల సంఘం అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల సందర్భంగా జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు దూరదర్శన్ మరియు ఆల్ ఇండియా రేడియోలో ఉచిత ప్రసార సమయం కేటాయించేందుకు డిజిటల్ టైమ్ వోచర్లు జారీ చేసింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 39A ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో అభ్యర్థుల జాబితా ప్రకటించిన తేదీ నుంచి పోలింగ్‌కు రెండు రోజుల ముందు వరకు ప్రసార కాలాన్ని షెడ్యూల్ చేస్తారని పేర్కొంది. లాటరీ విధానంలో ప్రసార సమయాల కేటాయింపు జరగనుందని వెల్లడించింది. ఈ పథకం కింద ప్రతి గుర్తింపు పొందిన పార్టీకి 45 నిమిషాల ప్రాథమిక ఉచిత ప్రసార సమయం ఇవ్వబడుతుందని, గత ఎన్నికలలో పనితీరు ఆధారంగా అదనపు సమయం కూడా కేటాయిస్తామని ఈసీఐ తెలిపింది. ప్రసారానికి ముందు పార్టీలు మార్గదర్శకాలను పాటిస్తూ ట్రాన్స్క్రిప్ట్‌లు, రికార్డింగ్‌లు సమర్పించాల్సి ఉంటుందని సూచించింది. అలాగే ప్రసార భారతి ఆధ్వర్యంలో ప్యానెల్ చర్చలు, వాదోపవాదాలకు కూడా అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించింది.



## వైసీపీ నేతల వ్యాఖ్యలపై విమర్శలు రాజకీయ వేడి పెరుగుతోంది

సందేశం టైమ్స్, ఆంధ్రప్రదేశ్, మార్చి 24, ప్రతినిధి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల వ్యాఖ్యలపై రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చ చెలరేగింది. కొంతమంది నాయకులు చేసిన వ్యాఖ్యలు ప్రజల్లో అసంతృప్తి కలిగిస్తున్నాయని ప్రతిపక్ష వర్గాలు ఆరోపిస్తున్నాయి. ముఖ్యంగా మహిళా నాయకుల మాటతీరు, ప్రజలను ఉద్దేశించిన వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిణామాలపై స్పందిస్తూ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంపై కూడా ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. పార్టీ నేతల అనుచిత వ్యాఖ్యల వల్ల ప్రజల్లో ప్రతికూల భావన ఏర్పడి ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజాస్వామ్యంలో మాటల బాధ్యత చాలా ముఖ్యమని, నాయకులు సంయమనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో రాజకీయ పార్టీలు ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యూహాలు మార్చుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు సూచిస్తున్నారు.

## వడదెబ్బల పట్ల అప్రమత్తంగా ఉండాలి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచనలు




సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 24, ప్రతినిధి: వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల డీహైడ్రేషన్ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసి త్రాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. బస్ స్టాండ్లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కూడా నీటి కొరత లేకుండా చూడాలని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచి, పిహెచ్సీలలో వడదెబ్బ బాధితులకు బెడ్లు, సెలైన్‌లు సిద్ధంగా ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో త్రాగునీటి సదుపాయాలు కల్పించాలని, గ్రామాల్లో పశువులకు నీటి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజలు మధ్యాహ్న సమయంలో బయటకు రాకుండా జాగ్రత్తలు పాటిస్తూ, కాటన్ దుస్తులు ధరించి, ఓఆర్ఎస్ లేదా పండ్ల రసాలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, జడ్పీ సీఈఓ శిరీష, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు కలెక్టర్ హెచ్చరిక



సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 24, ప్రతినిధి: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఆయన, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి గ్రీవెన్స్‌లకు ప్రాధాన్యత ఇచ్చి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులను వేగవంతం చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 15వ ఫైనాన్స్ నిధులతో అంగన్వాడీ కేంద్రాల్లో మిగిలిన పనులు పూర్తి చేసి, పీహెచ్సీలను ఆధునికీకరించాలని, గ్రంథాలయాల అభివృద్ధికి కూడా నిధులు వినియోగించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణిలో భూ సమస్యలకు సంబంధించిన 49, డిపిఓకు 5, డీఆర్డీఏకు 3, డిఎంహెచ్ఓకు 3 మరియు ఇతర శాఖలకు చెందిన 9 దరఖాస్తులు సహా మొత్తం 69 వినతులు అందగా, వాటిని సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, జడ్పీ సీఈఓ శిరీష, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, సిపిఓ కిషన్, డీఎఫ్ఓ సతీష్, సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు సంగారెడ్డి పైలెట్ – ఆరోగ్య సేవల్లో కీలక ముందడుగు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 24, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాను డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు పైలెట్ జిల్లాగా ఎంపిక చేయడంతో ఆరోగ్య రంగంలో కీలక ముందడుగు పడింది. సోమవారం నుంచి సంగారెడ్డి డివిజన్ పరిధిలోని 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా ఆసుపత్రులు, మూడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగుల డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌ను సాఫ్ట్‌వేర్‌లో ప్రయోగాత్మకంగా నమోదు చేయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఇందిరానగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి నమోదు ప్రక్రియ, డేటా ఎంట్రీ, రోగుల వివరాల సేకరణ విధానాన్ని పరిశీలించారు. రోగుల ఆరోగ్య చరిత్రను డిజిటల్ రూపంలో భద్రపరచడం ద్వారా వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించవచ్చని తెలిపారు. నెట్‌వర్క్, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ ప్రగతిని సమీక్షిస్తూ సమర్థవంతంగా అమలు చేపట్టాలని సూచించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ ద్వారా రోగుల ఆరోగ్య చరిత్ర, పరీక్షల వివరాలు, చికిత్స సమాచారం ఒకే వేదికపై అందుబాటులో ఉండి అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వసంత్ రావు, డాక్టర్ శశాంక్, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## దానం నాగేందర్ వ్యవహారంపై స్పీకర్‌కు నోటీసులు విచారణ ఏప్రిల్ 16కు వాయిదా



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 24, ప్రతినిధి: తెలంగాణ హైకోర్టు దానం నాగేందర్ అనర్హత అంశంపై కీలక పరిణామం చోటుచేసుకుంది. దానం నాగేందర్ పై స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి తర్వాత కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేసినందున ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ అంశంపై స్పందించేందుకు దానం నాగేందర్‌తో పాటు స్పీకర్‌కు నోటీసులు జారీ చేసిన హైకోర్టు, కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేసింది.

## చలో అసెంబ్లీ పిలుపు నేపథ్యంలో బీజేపీ నేతల అరెస్టు



సందేశం టైమ్స్, చింతకాని, మార్చి 24, ప్రతినిధి: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎన్ రామచంద్ర రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరసనగా చలో అసెంబ్లీ ముట్టడి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో ముందస్తు చర్యగా చింతకాని మండలంలో బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అర్ధరాత్రి 1 గంట 10 నిమిషాల సమయంలో పోలీసులు చింతకాని బీజేపీ మండల అధ్యక్షుడు కొండా గోపి, ప్రధాన కార్యదర్శి గోదా మంగయ్య, సీనియర్ నాయకుడు కోరిపెల్లి శ్రీను ఇళ్లకు చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ, కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి అరెస్టులు ఎన్ని చేసినా రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ హామీలపై బీజేపీ ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని, తెలంగాణలో అధికారంలోకి వచ్చే దిశగా పోరాటాలు కొనసాగిస్తామని పార్టీ నాయకులు స్పష్టం చేశారు.



## ముదిరాజ్ కాలనీలో నీరు, డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలు పరిష్కరించాలంటూ వినతి


సందేశం టైమ్స్, అనంతగిరి, మార్చి 24, ప్రతినిధి: అనంతగిరి మండలం వాయిల సింగారం గ్రామంలోని ముదిరాజ్ కాలనీలో నెలకొన్న మంచినీటి, డ్రైనేజీ మరియు సీసీ రోడ్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కాలనీ యువకులు గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు కు వినతి పత్రం సమర్పించారు. కాలనీలో తాగునీటి కొరత తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో మురుగు నీరు నిల్వవుతుందని, అలాగే సీసీ రోడ్లు లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని యువకులు వివరించారు. సమస్యలను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌ను కోరగా, ఆయన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## పెద్ద చెల్మడ గ్రామంలో సీసీ రోడ్ ప్రారంభం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 24, ప్రతినిధి: ఆందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి మండల పరిధిలోని పెద్ద చెల్మడ గ్రామంలో సీసీ రోడ్డును మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ కృషితో ప్రారంభించారు. ఈ కార్యక్రమం మార్కెట్ కమిటీ చైర్మన్ మంతురి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా, గ్రామ సర్పంచ్ రాధాబాయి జోషి, ఉప సర్పంచ్ క్వజమోయినుద్దీన్, గ్రామ అధ్యక్షుడు ఉమ్మి ప్రభాకర్, యూత్ అధ్యక్షుడు ఇస్మాయిల్ పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు మురళీమోహన్ గౌడ్, షరీఫ్ మియా, నాయకులు పెంటయ్య గుప్తా, జి. రవి, గుండాల రాజు, బుషయ్య స్వామి, సఫ్దర్ మియా, రొంపల్లి శ్రీను, మైబూబ్, బిచ్చయ్య సతీష్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణంతో రాకపోకలు సులభతరమవుతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

## విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు రూ.కోటి బీమా చెక్కులు – సీఎం రేవంత్ రెడ్డి



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 24, ప్రతినిధి: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ శాఖ ఉద్యోగుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి చొప్పున ప్రమాద బీమా చెక్కులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క ముందుకు వచ్చి బాధిత కుటుంబాలను ఆదుకున్నందుకు సీఎం అభినందించారు. విధి నిర్వహణలో మృతి చెందిన ఓర్సు సురేశ్, ముక్తార్ బేగ్ కుటుంబాలకు ఈ చెక్కులు అందజేయగా, ఉద్యోగులు మరియు వారి కుటుంబాల్లో మనోధైర్యం పెంపొందించేందుకే అసెంబ్లీ సమావేశాల సమయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు వెల్లడించారు. సీపెక్ సర్వే ప్రకారం అర్హత కలిగిన కుటుంబాలన్నింటికీ రూ.5 లక్షల బీమా వర్తింపజేస్తున్నామని పేర్కొన్నారు. కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో కుటుంబ బీమా పథకాన్ని తీసుకొచ్చామని, విద్యుత్ మరియు సింగరేణి కార్మికులకు రూ.1 కోటి పైగా ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు సీఎం స్పష్టం చేశారు.




## హర్మూజ్ జలసంధిపై ఇరాన్ గట్టి హెచ్చరికలు అమెరికాతో ఉద్రిక్తతలు తీవ్రం

సందేశం టైమ్స్, అంతర్జాతీయ, మార్చి 24, ప్రతినిధి: ఇరాన్ మరియు అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలకు ప్రతిస్పందనగా ఇరాన్ తీవ్రంగా స్పందిస్తూ తమ దేశంలోని విద్యుత్ కేంద్రాలపై దాడి జరిగితే గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలపై ప్రతిదాడి చేస్తామని హెచ్చరించింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (IRGC) కీలక ప్రకటన చేస్తూ అమెరికా అనుబంధ ఐటీ వ్యవస్థలు, తాగునీటి శుద్ధి కేంద్రాలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని తెలిపింది. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి విషయంలో ఉద్రిక్తతలు పెరిగి, ఈ మార్గాన్ని శాశ్వతంగా మూసివేసే అవకాశముందని ఇరాన్ స్పష్టం చేసింది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాకర్ ఖాలిబాఫ్ ఘాటుగా స్పందిస్తూ తమ మౌలిక సదుపాయాలపై దాడి చేస్తే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సంక్షోభ ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు భారీగా పెరిగి బ్యారెల్‌కు 119 డాలర్లకు చేరుకున్నాయి. మరోవైపు ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు, లెబనాన్‌లో హెజ్బొల్లా దాడులు మధ్యప్రాచ్యంలో యుద్ధ వాతావరణాన్ని మరింత ముదిర్చాయి. తాజా పరిణామాల నేపథ్యంలో గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి.

## బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం – సిరిసిల్లలో టీఆర్‌పీ ఆగ్రహం



సందేశం టైమ్స్, సిరిసిల్ల, మార్చి 24, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో బీసీలకు తగిన నిధులు కేటాయించలేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని పార్టీ నేతలు విమర్శించారు. ప్రతి ఏడాది బీసీల అభివృద్ధికి 20,000 కోట్ల రూపాయలు కేటాయిస్తామని ప్రకటించినప్పటికీ, ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం 12,000 కోట్లకే పరిమితం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. బీసీ సబ్ ప్లాన్ అమలు చేస్తామని చెప్పి దానిని పక్కన పెట్టడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో సుమారు 60 శాతం జనాభా ఉన్న బీసీలకు కేవలం 6 శాతం నిధులు మాత్రమే కేటాయించగా, తక్కువ శాతం ఉన్న వర్గాలకు అధికంగా నిధులు కేటాయించడం సామాజిక న్యాయానికి విరుద్ధమని ప్రశ్నించారు. ఈ అన్యాయాలపై నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలతో ఆందోళనలు చేపట్టాలని పార్టీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో సిరిసిల్లలో టీఆర్‌పీ ఆధ్వర్యంలో దండు వినోద్ అధ్యక్షతన ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తా వరకు వెళ్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ప్రెస్ మీట్ నిర్వహించి తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దేవరాజు, కలికోట రేణుక, గుండేటి శేఖర్, కోడూరి శ్రీహరి, దూడం సత్యం, నర్మేట స్వాతి, వేణు, చిట్టిపెల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




## బీసీలకు బడ్జెట్ మొండిచేయి – జనగామలో టీఆర్‌పీ నిరసన గర్జన

సందేశం టైమ్స్, జనగామ, మార్చి 24, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌లో బీసీ వర్గాలకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు పట్టణ అధ్యక్షుడు గడ్డం కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదరి సతీష్ ముదిరాజ్ పాల్గొని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరమని, ఎన్నికల సమయంలో 'కామారెడ్డి డిక్లరేషన్' పేరిట ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. బీసీ కార్పొరేషన్లు నిధుల లేమితో నిలిచిపోయినప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. ఇది నిర్లక్ష్యం మాత్రమే కాకుండా బీసీల హక్కుల దోపిడీ అని వారు పేర్కొన్నారు. బీసీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సంతోష్, మండల అధ్యక్షులు ప్రశాంత్, యూత్ మండల అధ్యక్షుడు ముక్క విష్ణువర్ధన్, రఘునాథ్‌పల్లి మండల అధ్యక్షుడు గౌరీశంకర్ గౌడ్, సోషల్ మీడియా నార్త్ స్టేట్ కన్వీనర్ కాసోజు బ్రహ్మాచారి, లకావత్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# వ్యవసాయ యాంత్రీకరణతో రైతుల ఆదాయం పెంపు – కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 24, ప్రతినిధి: జిల్లాలో రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ ఉత్పాదకతలో వృద్ధి సాధించేందుకు ఫార్మ్ మెకనైజేషన్, వర్షాధార ప్రాంతాల అభివృద్ధి (RAD), తేనెటీగల పెంపకం పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో వ్యవసాయ, ఉద్యానవన, డీఆర్‌డీఏ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన ఫార్మ్ మెకనైజేషన్ లక్ష్యాలను వేగంగా సాధించాలని, ఇప్పటివరకు సాధించిన పురోగతికి సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లు వెంటనే సమర్పించాలని సూచించారు. ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా మినీ ట్రాక్టర్లు, పవర్ వీడర్స్, పవర్ టిల్లర్స్, బ్రష్ కట్టర్స్, పవర్ స్ప్రేయర్స్ వంటి యంత్రాల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని, జిల్లాలో ఇప్పటికే 97 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. వర్షాధార ప్రాంతాల అభివృద్ధి పథకం ద్వారా రైతుల ఆదాయం పెంపు, ఆహార భద్రత, వ్యవసాయ ఉత్పాదకత మెరుగుదల లక్ష్యంగా సమగ్ర వ్యవసాయ విధానాలను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. తేనెటీగల పెంపకం కార్యక్రమాన్ని విస్తరించి ఎక్కువ మంది రైతులకు బీహైవ్ యూనిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని, స్వయం సహాయక సంఘాల మహిళలను ఇందిరా మహిళా శక్తి పథకం కింద ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ ఏపీడి సూర్యరావు, ఉద్యానవన శాఖ అధికారి సోమేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్ ప్రావీణ్య



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 24, ప్రతినిధి: సంగారెడ్డి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో గల శ్రీ సాయి కృష్ణ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ విధానం, హాల్ ఏర్పాట్లు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, భద్రతా చర్యలను పరిశీలించారు. పరీక్షలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ తెలిపారు. కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లు పరీక్షా నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేని వ్యక్తులను, ముఖ్యంగా మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకూడదని ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చూడాలని కలెక్టర్ సూచించారు.



# ప్రజావాణిలో 49 దరఖాస్తులు స్వీకరణ – వేగవంత పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 24, ప్రతినిధి: ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును పెండింగ్‌లో ఉంచకుండా వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ శాఖలకు సంబంధించిన మొత్తం 49 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వినతిని ప్రాధాన్యతతో పరిగణించి సంబంధిత శాఖ అధికారులు నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించడం ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు వినిపించే ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తమిళనాడు ఎన్నికలు: ఎన్‌డీఏ సీట్ల పంపకం ఖరారు

సందేశం టైమ్స్, చెన్నై, మార్చి 24, ప్రతినిధి: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్‌డీఏ కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకం ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం భారతీయ జనతా పార్టీ కు 27 సీట్లు కేటాయించేందుకు అన్నాడీఎంకే అంగీకరించింది. గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీకి 7 సీట్లు ఎక్కువగా లభించడం గమనార్హం. అలాగే పట్టాళి మక్కల్ కచ్చి కు 18 సీట్లు, అమ్మ మక్కల్ ముంద్రా కజగం కు 11 సీట్లు కేటాయించేందుకు కూడా కూటమి నేతలు అంగీకరించారు. ఈ సీట్ల పంపకం ఒప్పందంపై కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ మరియు అన్నాడీఎంకే ప్రధాన నాయకుడు ఎడప్పాడి పళనిస్వామి సంతకాలు చేశారు. రాబోయే ఎన్నికల్లో బలమైన పోటీకి సిద్ధమవుతూ కూటమి పార్టీలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. ఈ ఒప్పందంతో తమిళనాడు రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడగా, ఎన్నికల పోటీ మరింత రసవత్తరంగా మారనుంది

# బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం – నిర్మల్‌లో టీఆర్‌పీ ఆందోళన



సందేశం టైమ్స్, నిర్మల్ జిల్లా, మార్చి 24, ప్రతినిధి: రాష్ట్ర బడ్జెట్ 2026-27లో బీసీ వర్గాలకు తగిన నిధులు కేటాయించలేదని ఆరోపిస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు జరిగిన ఈ ఆందోళనలో జిల్లా అధ్యక్షుడు గైని సాయి మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 60 శాతం జనాభా కలిగిన బీసీలకు కేవలం 6 శాతం బడ్జెట్ కేటాయించడం తీవ్ర అన్యాయమని విమర్శించారు. అదే సమయంలో తక్కువ శాతం జనాభా ఉన్న వర్గాలకు అధిక నిధులు కేటాయించడం ప్రభుత్వ పక్షపాత ధోరణిని చూపిస్తోందని మండిపడ్డారు. బీసీలకు వారి జనాభాకు అనుగుణంగా నిధులు కేటాయించాలని, సముచిత న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని పునఃపరిశీలించి బీసీ వర్గాలకు తగిన వాటా ఇవ్వకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జెట్లోడ్ శంకర్, రాజన్న, భోజన్నతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో బీసీలకు మొండిచేయి నర్సాపూర్‌లో టీఆర్‌పీ నిరసన గర్జన




సందేశం టైమ్స్, మెదక్ జిల్లా, మార్చి 24, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌లో బీసీ వర్గాలకు ఘోర అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ కమిటీ తీవ్రంగా మండిపడింది. పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు రాష్ట్ర కార్యదర్శి నగేష్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు ఇమాంపురం యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. ఎన్నికల సమయంలో 'కామారెడ్డి డిక్లరేషన్' పేరిట బీసీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకుండా మొండిచేయి చూపిందని ఆరోపించారు. బీసీ కార్పొరేషన్లు నిధుల లేమితో నిలిచిపోయినప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలేదని పేర్కొన్నారు. ఇది నిర్లక్ష్యం మాత్రమే కాకుండా బీసీల హక్కుల దోపిడీ అని మండిపడ్డారు. బీసీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, న్యాయం జరిగే వరకు టీఆర్‌పీ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రాములు ముదిరాజ్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, సోషల్ మీడియా అధ్యక్షుడు కమలయ్య, సురేష్ ముదిరాజ్, నర్సాపూర్ మండల అధ్యక్షుడు కురుమ ఆనంద్, జిల్లా యూత్ అధ్యక్షుడు పోతుల రవీందర్, మహిళా అధ్యక్షురాలు సిద్ధక్క తదితరులు పాల్గొన్నారు.

# బీసీల బడ్జెట్ అంకెల గారడి – ఆదిలాబాద్‌లో టీఆర్‌పీ నిరసన గర్జన



సందేశం టైమ్స్, ఆదిలాబాద్ జిల్లా, మార్చి 24, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ళ రవీందర్ నేతృత్వంలో చేపట్టిన ఈ ఆందోళనలో బీసీ సబ్ ప్లాన్, కామారెడ్డి డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ప్రస్తుత బడ్జెట్ కేవలం అంకెల గారడిగానే ఉందని, బీసీల సంక్షేమం కోసం కాకుండా ఓసీల ప్రయోజనాల కోసం రూపొందించబడిందని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు ఈ ఏడాది కేవలం ₹12,511 కోట్లు కేటాయించడం హాస్యాస్పదమని, గత ఏడాది కేటాయించిన ₹11,500 కోట్లలో ₹2,426 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. బడ్జెట్‌లో మిగిలిన నిధులపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీలను నమ్మించి మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించి తీన్మార్ మల్లన్న నాయకత్వంలో రాజ్యాధికారం సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విద్యకు 8 శాతం, వైద్యానికి 4 శాతం నిధులు కేటాయించడం దురదృష్టకరమని విమర్శిస్తూ, బడ్జెట్‌లో కనీసం 40 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హోమ్ స్టే యూనిట్లకు క్లాసిఫికేషన్ దరఖాస్తుల ఆహ్వానం



పత్రికా ప్రకటన

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖా, సంగారెడ్డి జిల్లా

సంగారెడ్డి జిల్లాను క్షయ రహితంగా తీర్చిదిద్దుదాం: ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా 'టిబి ముక్త్ భారత్ అభియాన్ v 2.0' ప్రారంభం

సంగారెడ్డి, మార్చి 23, 2026:

ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం (మార్చి 24) పురస్కరించుకుని, సంగారెడ్డి జిల్లా యంత్రాంగం మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 'టిబి ముక్త్ భారత్ అభియాన్ v 2.0' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో రేపు (24-03-2026) సంగారెడ్డి ఎక్స్ రోడ్ సమీపంలోని పోతిరెడ్డిపల్లి సబ్ సెంటర్ వద్ద ఉదయం 10.00 AM ఈ ప్రత్యేక కార్యక్రమం అధికారికంగా ప్రారంభం కానుంది.

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 144 గ్రామాల్లో ఈ టీబీ ముక్త్ భారత్ అభియాన్ v 2 .0 కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించబడతాయి.

ప్రతీ గ్రామంలో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించడం, వారికి మెరుగైన ఉచిత వైద్యం అందించడం మరియు పోషకాహార సహకారం (నిక్షయ్ మిత్ర ద్వారా) అందించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం.

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి (DM&HO)
సంగారెడ్డి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 24, ప్రతినిధి: రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రోత్సాహం కల్పించేందుకు హోమ్ స్టే యూనిట్లకు క్లాసిఫికేషన్/రీక్లాసిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు జిల్లా యువజన, క్రీడలు మరియు టూరిజం శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి తెలిపారు. హోమ్ స్టేలు పర్యాటకులకు స్థానిక సంస్కృతి, ఆహారపు అలవాట్లు, జీవన విధానాన్ని అనుభవించే అవకాశాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ యూనిట్లను సౌకర్యాలు, ప్రమాణాల ఆధారంగా వర్గీకరించి తెలంగాణ టూరిజం ద్వారా రేటింగ్ ఇవ్వబడుతుందని వివరించారు. జిల్లాలోని హోమ్ స్టే యజమానులు తమ యూనిట్లకు క్లాసిఫికేషన్ లేదా పునర్వర్గీకరణ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సిల్వర్ స్టార్ కేటగిరీకి రూ.2,000, గోల్డ్ స్టార్ కేటగిరీకి రూ.4,000 డిమాండ్ డ్రాఫ్ట్‌ను కమిషనర్/డైరెక్టర్ ఆఫ్ టూరిజం, తెలంగాణ ప్రభుత్వం పేరిట చెల్లించాలని తెలిపారు. ఆసక్తి గల వారు తమ హోమ్ స్టే వివరాలు, ఫోటోలు, అవసరమైన పత్రాలతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

# అమరవీరుల త్యాగాలకు నివాళి – తారా కళాశాలలో షహీద్ దివస్ నిర్వహణ




సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 24, ప్రతినిధి: సంగారెడ్డి తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, జువాలజీ విభాగాల ఆధ్వర్యంలో షహీద్ దివస్ ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. ఈ సందర్భంగా భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం వారు చేసిన ప్రాణత్యాగాలు అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. అమరవీరుల నిస్వార్థ సేవల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, వారి ఆశయాలను నెరవేర్చేందుకు యువత సామాజిక సేవ, దేశ సేవలో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ నిర్మల, డాక్టర్ జగదీశ్వర్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఫోటో ఆవిష్కరణ కార్యక్రమం



సందేశం టైమ్స్, చింతకాని, మార్చి 24, ప్రతినిధి: ఖమ్మం బోనకల్ రోడ్డులోని వాసవి క్లబ్ సాయి గణేష్ నగర్ ఆధ్వర్యంలో సీతంపేట పానకాల లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం ఆవరణలో లక్ష్మీనరసింహస్వామి వారి ఫోటో ఆవిష్కరణ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కడవెండి శ్రీనివాస్ అమృత హస్తాలతో ఫోటోను ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పానకం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి క్లబ్ ఆర్య వైశ్య సమాజంతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చంద్రరావు, జిల్లా కార్యదర్శి గోళ్ల రాధాకృష్ణమూర్తి, ఆర్యవైశ్య మహాసభ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ తేలుకుంట్ల ధనంజయరావు, మండల అధ్యక్షుడు నాగుబండి వెంకటనారాయణ, కొదుమూరు భద్రయ్య, డోకు పూర్తి నాగేశ్వరరావు, వాసవి క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పంట మార్పిడి పై రైతులకు శిక్షణ కార్యక్రమం



సందేశం టైమ్స్, చింతకాని, మార్చి 24, ప్రతినిధి: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని అఖిల భారత సమగ్ర వ్యవసాయ పరిశోధన విభాగం, రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో చింతకాని మండలం బస్వాపురం గ్రామ రైతు వేదికలో పంట మార్పిడి పై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ఎం.డి. లతీఫ్ పాషా సమగ్ర వ్యవసాయ పద్ధతులపై వివరించగా, డా. కె. రుక్మిణీ దేవి పప్పు దినుసుల పంటలైన పెసర, మినుము రకాల ఎంపిక, యాజమాన్యంపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త నాగజ్యోతి వివిధ పంటల్లో సస్యరక్షణ చర్యలు, డా. వి. చైతన్య ఉద్యాన పంటల యాజమాన్య విధానాలు, డా. కె. శ్రీధర్ యాసంగిలో వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు సూచనలు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆవుల నర్సింహారావు, మండల వ్యవసాయ అధికారిణి మానస, వ్యవసాయ విస్తరణ అధికారిణి ఆయేషా, పరిశోధన సిబ్బంది వినయ్, సాయి బాబా, అభ్యుదయ రైతు ఆవుల తిరుపతయ్యతో పాటు సుమారు 50 మంది రైతులు పాల్గొన్నారు.



## శ్రీశైలం మల్లన్నకు రికార్డ్ ఆదాయం

సందేశం టైమ్స్, నంద్యాల(శ్రీశైలం), మార్చి 24, ప్రతినిధి: ఉగాది మహోత్సవాల సందర్భంగా శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంకు భక్తుల నుంచి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం లభించింది. గత 30 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా మొత్తం రూ.7,19,58,064 నగదు వచ్చినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. నగదుతో పాటు 122 గ్రాముల బంగారం, 6.5 కిలోల వెండి, విదేశీ కరెన్సీ కూడా హుండీలో సమర్పించబడినట్లు వెల్లడించారు. శనివారం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు



## హోమ్ స్టే యూనిట్లకు క్లాసిఫికేషన్ / రీక్లాసిఫికేషన్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 24, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ హోమ్ స్టే యూనిట్లను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని హోమ్ స్టే యజమానులకు రేటింగ్ వ్యవస్థ అమలు చేస్తూ, తమ యూనిట్లకు క్లాసిఫికేషన్ / రీక్లాసిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల శాఖ మరియు టూరిజం శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి సోమవారం వెల్లడించారు.

దరఖాస్తు రుసుము:

సిల్వర్ స్టార్ కేటగిరీ – రూ. 2,000/-

గోల్డ్ స్టార్ కేటగిరీ – రూ. 4,000/-


డిమాండ్ డ్రాఫ్ట్ కమీషనర్ / డైరెక్టర్ ఆఫ్ టూరిజం, తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్ పేరిట చెల్లించాలి. హోమ్ స్టే వివరాలు, ఫోటోలు మరియు అవసరమైన పత్రాలతో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేయవచ్చని అధికారులు సూచించారు. పూర్తి సమాచారం మరియు దరఖాస్తు విధానం కోసం అధికారిక వెబ్‌సైట్ www.tourism.telangana.gov.in� ను సందర్శించవచ్చని తెలియజేశారు. పర్యాటక రంగంలో భాగస్వామ్యం కావాలనుకునే ఆసక్తి గల హోమ్ స్టే యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా అధికారులు సూచించారు.





## ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలంగాణ దివ్యాంగుల మహా పాలాభిషేకం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 24, ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించిన చర్యలకు కృతజ్ఞతగా తెలంగాణ దివ్యాంగులు హైదరాబాద్‌లోని బస్ భవన్ వేదికగా అత్యంత వైభవంగా మహా పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో NPRD INDIA, SCIAT మరియు TMDA సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణలోని వివిధ జిల్లాల నుండి వందలాది మంది దివ్యాంగులు పాల్గొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, తీవ్ర వైకల్యం ఉన్న వారికి 15,000 రూపాయల పింఛను, స్థానిక సంస్థల్లో నామినేటెడ్ పదవులు వంటి నిర్ణయాలకు కృతజ్ఞతగా దివ్యాంగులు చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, హర్షధ్వానాలతో తమ అభిమానాన్ని వ్యక్తపరచారు. ఈ కార్యక్రమంలో NPRD INDIA జాతీయ అధ్యక్షులు తుడుం రాజేందర్ స్కైటు, రాష్ట్ర అధ్యక్షులు షఫీ అహ్, సంగారెడ్డి జిల్లా వికలాంగుల మన్నే పోచయ్య పాల్గొన్నారు.



## గీత కార్మికుల సంక్షేమానికి రూ.5,000 కోట్లు కేటాయించాలి – KGKS వినతి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 24, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం (KGKS) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్యకు వినతిపత్రం సమర్పిస్తూ, రాష్ట్ర బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.5,000 కోట్లు కేటాయించాలని సంఘం నేతలు డిమాండ్ చేశారు. గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.93 కోట్లలో కేవలం రూ.17 కోట్లు మాత్రమే విడుదలై, మిగిలిన రూ.76 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఐదు లక్షల కుటుంబాలు ఆధారపడిన గీత వృత్తి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2026–27 బడ్జెట్‌లో గౌడ కులస్తుల సంక్షేమానికి తగిన నిధులు కేటాయించి, పెండింగ్ పింఛన్లు, ప్రమాద పరిహారం, ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు వెంటనే ఇవ్వాలని కోరారు. అదేవిధంగా, ఎక్స్‌గ్రేషియాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడం, వృత్తి పింఛన్‌ను రూ.2,000 నుంచి రూ.4,000కు పెంపు, జీవో 560 ప్రకారం భూముల కేటాయింపు, తాటి నీరా ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు, ప్రతి కార్మికునికి ద్విచక్రవాహనాలు, రక్షణ కిట్లు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎస్. రమేష్ గౌడ్ మాట్లాడుతూ వృత్తిదారుల సంక్షేమానికి కేటాయించిన నిధులు సరిపోవని, కనీసం రూ.25,000 కోట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జంగన్న గౌడ్, రామా గౌడ్, యాద గౌడ్, చెన్నా గౌడ్, నరసింహ గౌడ్, అంజా గౌడ్, వెంకటేశం గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లాలో మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశాలు

### మార్చి 31లోగా పనులు పూర్తిచేయాలి – కలెక్టర్ పి. ప్రావీణ్య

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 24, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, సంగారెడ్డి, నారాయణఖేడ్ స్టేడియంలలో కొనసాగుతున్న మౌలిక వసతుల పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, యువజన సంక్షేమ & క్రీడాభివృద్ధి, విద్యాశాఖ, శిశు సంక్షేమ, విద్యుత్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియం, నారాయణఖేడ్ స్పోర్ట్స్ స్టేడియం రిపేరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్మాణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్ ప్రారంభానికి వెంటనే ఏర్పాట్లు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుతీకరణ, చిన్నపాటి మరమ్మత్తులను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, పాఠశాలల కాంపౌండ్ వాల్స్, పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటును మార్చి 31 లోగా పూర్తి చేసి వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీడబ్ల్యూఓ లలిత కుమారి, సీపీఓ బాలశౌరి, స్పోర్ట్స్ అథారిటీ అధికారి అఖిలేష్ రెడ్డి, అదనపు డీఆర్‌డీఓ బాలరాజ్, డీఈఓ వెంకటేశ్వర్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## జిల్లాలో వంట గ్యాస్ సరఫరాలో ఎటువంటి కొరత లేదు – జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 24, ప్రతినిధి: జిల్లాలో వంట గ్యాస్ సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో సివిల్ సప్లై అధికారులు, గ్యాస్ ఏజన్సీలు పాల్గొని జిల్లాలో గ్యాస్ వినియోగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు, జిల్లాలో గ్యాస్ సరఫరాకు ఎటువంటి కొరత లేదని, తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు అనవసర ఆందోళనకు గురికాకుండా, అవసరాన్ని బట్టి సమయానికి గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని, ఒక బుకింగ్ నుంచి మరొక బుకింగ్ వరకు కనీసం 45 రోజుల వ్యవధి ఉండేలా చూడాలని సూచించారు. తరచుగా అవసరం లేకుండా బుకింగ్‌లు చేయడం వల్ల సరఫరా వ్యవస్థపై ఒత్తిడి ఏర్పడుతుందని తెలిపారు. గ్యాస్ బుకింగ్ చేసిన తర్వాత సంబంధిత ఏజెన్సీలు వినియోగదారుల ఇళ్ల వద్దకే సిలిండర్ సరఫరా చేస్తాయని, ఎవ్వరూ గ్యాస్ ఏజెన్సీలు లేదా గోదాముల వద్దకు వెళ్లి వేచి ఉండకూడదని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం వినియోగదారుల తేదీ వచ్చినప్పుడు సిలిండర్ అందజేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా ప్రజలకు గ్యాస్ సరఫరా నిరంతరంగా కొనసాగుతున్నందున ఎటువంటి ఆందోళన అవసరం లేదని, అపోహలు, వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె. సీతారామా రావు, జిల్లా సివిల్ సప్లై అధికారి మోహన్ బాబు, మేనేజర్ రాంబాబు, డిఏఓ శ్రీధర్ రెడ్డి, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## గద్దల ప్రకాశం పంతులు (నాగయ్య) సంతాప సభ ఖమ్మం కైకొండాయిగూడెంలో ఘనంగా నిర్వహణ

సందేశం టైమ్స్, ఖమ్మం, మార్చి 24, ప్రతినిధి: గద్దల ప్రకాశం పంతులు (నాగయ్య) సంతాప సభ ఘనంగా నిర్వహణ – ఖమ్మం కైకొండాయిగూడెం గ్రామంలో గద్దల ప్రకాశం పంతులు (నాగయ్య) అకాల మరణం సందర్భంగా వారిని స్మరించుకుని ఘన సంతాప సభ సోమవారం నిర్వహించబడింది. ఈ సభకు గ్రామ ప్రముఖులు, సామాజిక, రాజకీయ నాయకులు భారీ సంఖ్యలో హాజరై ప్రసంగాలు చేయగా, ప్రకాశం పంతులు చేసిన సత్కార, సేవా కార్యక్రమాలను స్మరించుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. సభలో గద్దల మోహన్ రావు (పాస్టర్), పి. శ్రీనివాసరావు(డాక్టర్), గద్దల దిలీప్ (లాయర్), గద్దల జనార్ధన్ రావు (సిపిఎం గ్రామ కార్యదర్శి), గుర్రం కృష్ణయ్య (డీలర్), గద్దల చిన్నప్ప, గద్దల నాగేశ్వరరావు (తెరాస నాయకులు), బి.రవికుమార్, యలమందల జగదీష్ (నాయి బ్రాహ్మణ టౌన్ ప్రెసిడెంట్ & ఎలక్ట్రానిక్ మీడియా టౌన్ ప్రెసిడెంట్) మరియు వారి కుమారులు గద్దల జయరాం (ఏ.డి.ఈ), గద్దల వీరబాబు పాల్గొన్నారు.

## ఫేక్ న్యూస్ – డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా ప్రకటనలో జాగ్రత్త



Donald J. Trump
@realDonaldTrump

I AM PLEASE TO REPORT THAT THE UNITED STATES OF AMERICA, AND THE COUNTRY OF IRAN, HAVE HAD, OVER THE LAST TWO DAYS, VERY GOOD AND PRODUCTIVE CONVERSATIONS REGARDING A COMPLETE AND TOTAL RESOLUTION OF OUR HOSTILITIES IN THE MIDDLE EAST. BASED ON THE TENOR AND TONE OF THESE IN DEPTH, DETAILED, AND CONSTRUCTIVE CONVERSATIONS, WITCH WILL CONTINUE THROUGHOUT THE WEEK, I HAVE INSTRUCTED THE DEPARTMENT OF WAR TO POSTPONE ANY AND ALL MILITARY STRIKES AGAINST IRANIAN POWER PLANTS AND ENERGY INFRASTRUCTURE FOR A FIVE DAY PERIOD, SUBJECT TO THE SUCCESS OF THE ONGOING MEETINGS AND DISCUSSIONS. THANK YOU FOR YOUR ATTENTION TO THIS MATTER! PRESIDENT DONALD J. TRUMP

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 24, ప్రతినిధి: ఇటీవల సోషల్ మీడియాలో డోనాల్డ్ ట్రంప్ ఖాతా నుండి వచ్చిన కొన్ని పోస్టులు వాస్తవానికి భ్రమ కలిగించే సమాచారంగా ఉన్నాయి. ఈ పోస్టులోని అంశాలను పరిశీలిస్తే, అవి నిజమైన వార్తలు కాదని స్పష్టమవుతుంది. ముఖ్యంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్ అనే శాఖ ఉద్దేశ్యం ఉంది. అయితే, అమెరికాలో 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్' 1947 లో 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్' గా మారించబడింది; ప్రస్తుతం అలాంటి శాఖ ఉనికిలో లేదు.అదనంగా, పోస్టులో భాషా తప్పిదాలు కనిపిస్తున్నాయి. ఉదాహరణకి "Which" బదులుగా "Witch" అని తప్పుగా వ్రాసారు. ఇలాంటి తప్పులు ఒక దేశ అధ్యక్షుడి అధికారిక ప్రకటనల్లో ఉండకూడదు. అలాగే, అమెరికా మరియు ఇరాన్ మధ్య ఈ తరహా "పూర్తి స్థాయి శాంతి చర్చలు" జరిగినట్లు ఏ అధికారిక మూలాలు ధృవీకరించలేదు.వాస్తవానికి, వార్తా సంస్థలు మరియు పత్రికల కోసం ముఖ్యమైన సూచనలు:అధికారిక వెబ్‌సైట్లు: వైట్ హౌస్ లేదా సంబంధిత విదేశాంగ శాఖ వెబ్‌సైట్లు పరిశీలించాలి.ప్రముఖ వార్తా సంస్థలు: AP, Reuters, PTI వంటి ప్రధాన మీడియా సంస్థలు ఆ వార్తను ఇస్తున్నాయో చూడాలి.ఖాతా వెరిఫికేషన్: సోషల్ మీడియా స్క్రీన్‌షాట్‌లను నేరుగా అధికారిక ఖాతాలోకి వెళ్లి ధృవీకరించాలి.సందేశం టైమ్స్ ఈ ఫేక్ న్యూస్‌ను ప్రత్యేకంగా గుర్తించి, చదరంగపూర్వకంగా అభిమానులకు తెలియజేస్తోంది. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చిన ఏదైనా వార్తను తనిఖీ చేయకుండా నమ్మకుండా ఉండాలని ముద్రపెడుతోంది.ఈ విధంగా, ఈ ఘటన ద్వారా ఫేక్ న్యూస్‌ను గుర్తించడం, వాస్తవ సమాచారం పొందడం ఎంత ముఖ్యం అనేది స్పష్టమవుతోంది.



## సాయిపేట్‌లో సీసీ రోడ్డు పనుల ప్రారంభం గ్రామాభివృద్ధికి మరో ముందడుగు

సందేశం టైమ్స్, వట్పల్లి మండల్, మార్చి 24, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు దామోదర్ రాజానర్సింహ ఆదేశాల మేరకు సాయిపేట్ గ్రామంలో శివాలయం సమీపంలో రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ ఆలూరి సంతోష ఆంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ఈ పనులు గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జొన్నాడ నాగరాజ్, శ్రీశైలం, శేఖర్, గ్రామ పెద్దలు, సీనియర్ నాయకులు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## అక్రమ పౌతి చేసిన నాయబ్ తహశీల్దార్ సస్పెండ్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 24, ప్రతినిధి:కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా మేళ్లచెర్వులో అక్రమంగా పౌతి (సక్సెషన్) చేసిన నాయబ్ తహశీల్దార్ శ్రీధర్ నాయక్‌ను సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు.

## గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల ఉక్కుపాదం.. 2.86 కోట్ల విలువ గల 572 కిలోల గంజాయి స్వాధీనం



సందేశం టైమ్స్ సంగారెడ్డి, మార్చి 24( సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్ )సంగారెడ్డి జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తూ ఎస్-న్యాబ్, సిసిఎస్, సదాశివపేట పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో సుమారు రూ.2.86 కోట్ల విలువ గల 572 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పటాన్ చెర్వు డిఎస్పీ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఇన్స్పెక్టర్లు నాగేశ్వర్ రావు, శివ కుమార్, వెంకటేశ్ సిబ్బందితో కలిసి నమ్మదగిన సమాచారం మేరకు సదాశివపేట బైపాస్ వద్ద తనిఖీలు నిర్వహించగా కియా సోనేట్ కారు (MH31EC0998), డిసిఎం వాహనం (MH45AP4313)లో తరలిస్తున్న 286 గంజాయి ప్యాకెట్లు పట్టుబడ్డాయి. ఈ కేసులో ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులు పింకు, పప్పు దలాయి, నారాయణ ప్రసాద్ బెహ్రాలను అరెస్ట్ చేసి సదాశివపేట పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం.151/2026 కింద కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలో మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం కొనసాగుతుందని, గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాల సమాచారాన్ని ఎస్-న్యాబ్ నంబర్ 8712656777కు అందించాలని, సమాచారదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసు చేదనలో కీలకంగా పనిచేసిన అధికారులను ఎస్పీ అభినందించారు.






పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.